# అరె! ఏమయింది..

గంటక్రితం ఫోన్ వచ్చిన దగ్గర నుంచీ చలం అశాంతిగా ఉన్నాడు. ఆ ఫోన్ వాళ్ల మామయ్య దగ్గర నుంచి వచ్చింది. ఆయనకో కూతురు ఉంది. పేరు కనకమహాలక్ష్మి. ఆ అమ్మాయిని తనకిచ్చి అర్జెంటుగా పెళ్లి చేసేయాలని ఆయన గారి ఆశ.

అసలు అలాంటి దేవతలపేర్లూ పురాణాల పేర్లూ అంటేనే చలానికి ఇష్టం ఉండదు. ఆ మాటకొస్తే తన పేరే చలానికి ఇష్టం ఉండదు. అందుకే పెద్దలు పెట్టిన "సింహాచలం" అన్న పేరును కత్తిరించి "చలం"గా చలామణి అవుతున్నాడు.

ఎక్కడ ఏ అప్లికేషన్ ఫారంలో పూర్తి పేరు రాయవలసి వచ్చినా ఆ ఫారం అచ్చొత్తిన వాళ్లనీ, అచ్చొత్తించిన వాళ్లనీ, తనకా పేరు పెట్టిన అమ్మానాన్నలనూ కసికసిగా తిట్టుకుంటాడు. సింహాచలం అప్పన్నమీద కోపం తెచ్చుకోబోయి తమాయించుకుంటాడు. ఎంతయినా దేవుడు కదా! ఆయనకు గనక కోపం వస్తే ఏమయిపోవాలి తను?

ఒకపక్క తనపేరుని గురించే దిగులుపడుతూంటే ఈ కనక మహాలక్ష్మి ఒకటి! ఎంత పవర్ ఫుల్ దేవత అయితే మాత్రం విశాఖపట్నంలో ఆడపిల్లలకు ఆ పేరే పెట్టుకోవాలా?

చలానికి తన అందంమీద, తెలివితేటల మీదా మా చెడ్డ నమ్మకం. చెప్పొద్దూ! చలం కొంచెం ఎత్తెత్తుగా ఎర్రెర్రగా చూడ్డానికి ముద్దుగానే ఉంటాడు. అద్దం ముందు నిలబడి అరగంటపైగా దువ్వెనతో జుట్టును అటూ ఇటూ దువ్వుతూ, చిరునవ్వులు చిందిస్తూ మురిసిపోతూ కాలక్షేపం చేయటం చలానికి చాలా ఇష్టం. చదువుకునే రోజుల్లో సినిమా యాక్టరు అవ్వాలని కలలు కనీకనీ విసుగొచ్చి, అసలు కలలు కనటమే మానేసాడు. కలలయితే కన్నాడు కానీ ఆ కలలను నిజంచేసుకునే మార్గం చలానికి తెలియలేదు. దానితో చదువుకూడా కుంటినడక నడిచింది. ఎలాగోలా డిగ్రీనయితే సాధించాడు కానీ ప్రతి ఉద్యోగానికీ పోటీ పరీక్షలుండటంతో చలానికి నిద్రకరువయింది.

కొన్ని పరీక్షలకు అసలు పిలుపు రాలేదు. పిలిచిన పరీక్షలకు ఇచ్చిన కొశ్చను పేపరు చలానికి అర్ధంకాలేదు. చలం తన భవిష్యత్తును గురించి బెంగెట్టుకున్నాడో లేదో చెప్పలేం కానీ చలం తండ్రి మాత్రం కొడుకు భవిష్యత్తును

డా॥ మాదిరాజు రామలింగేశ్వరరావు

గురించి బాగా బెంగెట్టేసుకున్నాడు. ఆయనకున్న ఒకే ఒక నలుసు చలం.

అసలే గుండెజబ్బు పేషంటేమో ఓ రాత్రివేళ కొడుకు బ్రతుకు తెరువుకోసం తన బ్రతుకును చాలించాడు. అలా చలం బ్యాంకు ఉద్యోగి అయ్యాడు. ఉద్యోగంలో చేరిన ఒక సంవత్సరం పాటు చలం బ్యాంకు మేనేజరుకు ఒక పజిల్‌లా మారాడు. ఏ సెక్షన్‌లో వేసినా నీళ్లమీద బెండులా తేలేవాడు. మొత్తానికి ఇద్దరు ముగ్గురు సీనియర్లు రాత్రింబవళ్లూ కుస్తీపట్టి రాతినేల లాంటి చలం బుర్రలోంచి "అవగాహన" అనే మొక్కను మొలిపించగల్గారు.

చలం ఉద్యోగంలో స్థిరపడ్డాక వాళ్లమ్మకు కొడుకు పెళ్లి చేస్తే బాగుండుననిపించింది. అలా అనుకోవటమేతరువాయి... అన్నగారి కూతురు 'కనకం' ఆవిడ మనసులో మెదిలింది. అవును... చెప్పలేదు కదూ! ఇంట్లోవాళ్లంతా ఆ అమ్మాయిని 'కనకం' అని పిలుస్తారు.

తల్లి ఆ పేరు ఎత్తగానే చలం కస్సుమన్నాడు. "కనకం ఏమిటమ్మా శునకం లాగా!" అని కోప్పడ్డాడు. "అదేమిటిరా! ఆ పేరుకేం వచ్చింది? కనకం అంటే బంగారం అని కదా అర్థం?" అంది వాళ్లమ్మ. చలానికి కేవలం ఆ అమ్మాయి పేరుమీదేకాదు రూపంమీద కూడా చాలా కోపం ఉంది. ఆ అమ్మాయిని చిన్నప్పుడెప్పుడో ఒకసారి చూసాడు. చలిమిడిముద్దలా ఉంటుంది. నాలుగేళ్ల వయసులోనే అలా ఉంటే ఈ పాటికి పిప్పళ్ల బస్తాలా తయారయి ఉంటుంది. చలం తండ్రి బ్యాంకులో ఆఫీసరుగా



పనిచేస్తూ ప్రతి మూడేళ్లకూ ట్రాన్స్‌ఫర్ అవడం వల్ల చలానికి మేనమామగారి ఇంటికి వెళ్లే అవకాశం పెద్దగా లేకుండా పోయింది. కనకమహాలక్ష్మి చాలా చురుకయినదనీ, అన్నిక్లాసులలోనూ ఫస్టురాంకులో వస్తున్నదనీ, చక్కగా పాడుతుందనీ వాళ్ల మామయ్య కలిసినప్పుడల్లా చలం వినేటట్లు చలంవాళ్లమ్మకు చెబుతూ ఉంటాడు. "ఆ! పోదూ బడాయి" అని చలం మనసులో అనుకుంటాడు. ఇప్పుడు ఆవిడగారు డిగ్రీ పాసయి ఏదో పబ్లిక్‌స్కూల్‌లో వైస్‌ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్నదిట!

"అయినా ఆవిడ ఏంచేస్తుంటే తనకేమిటట? ఆవిడను చేసుకోవడం మాత్రం కుదరదు. అంతే!" అనుకున్నాడు చలం.

కానీ ఎలా ఈ విపత్తు నుంచి తప్పించుకోవటం? చలం తల్లికి అన్నగారన్నా, ఆ కుటుంబం అన్నా వల్లమాలిన మమకారం! మామయ్యకే డైరెక్టుగా "నేను మీ అమ్మాయిని చేసుకోను" అని చెప్పేస్తే...? అమ్మో! అది సాధ్యంకాని పని. ఆయనగారు గొప్ప మాటకారి. ఎదుటపడి చెప్పి ఆయనను ఏవిధంగానూ తను ఒప్పించలేడు. బాగా ఆలోచించగా చలానికి ఒక మార్గం తోచింది. వెంటనే మామయ్య అడ్రసుకు ఒక ఆకాశరామన్న ఉత్తరం వ్రాసాడు.

"ఫలానా చలానికి మీ అమ్మాయిని ఇచ్చి వివాహం చేయాలనుకుంటున్నారని తెలిసింది. అతడి కేరక్టర్ మంచిదికాదు. ఒకరిద్దరు అమ్మాయిలతో అతడికి ఎఫైర్ ఉంది. అయినా మీరు అమ్మాయిని అతడికి ఇచ్చి చేద్దామనుకుంటే మీ ఇష్టం!"- ఇదీ ఉత్తరంలోని సారాంశం.

ఉత్తరమయితే వ్రాశాడుకానీ, అది చదివాక మామయ్య రియాక్షన్ ఎలా ఉంటుందో తెలుసుకోవాలని చలానికి క్యూరియాసిటీ పెరిగింది. కానీ ఎలా తెలుసుకోవడం? మళ్లీ అతగాడి మెదడులో ఒక మెరుపు మెరిసింది. పబ్లిక్ టెలిఫోన్ బూత్ నుంచి మామయ్యగారింటికి ఫోన్ చేశాడు. అవతల ఫోన్ ఎత్తగానే గొంతు మార్చి "హలో" అన్నాడు. ఆ ఫోన్ ఎత్తింది వాళ్లత్తయ్య.

"నేనండీ ఆకాశరామన్నను" అన్నాడు చలం.

"ఎవరూ?" అంది వాళ్లత్తయ్య.

ఆవిడ గొంతులో భయం స్పష్టంగా కన్పిస్తోంది.

"చెప్పానుకదా! ఆకాశరామన్నను. నేను వ్రాసిన ఉత్తరం అందిందా!" కొద్దిగా గట్టిగా మాట్లాడాడు చలం.

"అవునాబాబూ! ఎందుకలా వ్రాశావు? మా చలం నీకెలా తెలుసు?" అడిగింది ఆవిడ.

"మీ మేలు కోరేవాణ్ణి కనుక వ్రాశాను. మీ అమ్మాయిని ఆ చలానికిచ్చి పెళ్లిచేసి గొంతు కోయకండి!" ఆవిడ మాట్లాడలేదు.

చలం ఫోన్ పెట్టేసి బిగ్గరగా నవ్వుకున్నాడు. మొత్తానికి తను వ్రాసిన ఉత్తరం బాగానే పనిచేసింది. ఇక మామయ్య చస్తే తన జోలికిరాడు.

ఆ తర్వాత అతననుకున్నట్లు చలానికి మామయ్య దగ్గరనుంచి ఎలాంటి ఫోనూ రాలేదు. ఆ తర్వాత చలానికి రెండు మూడు సంబంధాలువచ్చాయి. అందులో ఒక సంబంధం చలానికి బాగా నచ్చింది. ఆ అమ్మాయిది విజయనగరం. ఆమె తండ్రి రైల్వేగార్డు. ఆయన చలాన్ని కలిసినప్పుడు తను తన కూతుర్ని "పట్టాలు తప్పని బండి"లా ఎలా పెంచాడో చెప్పాడు. పిల్ల ఫొటోలో చాలా బాగుంది. పేరు "అనుష్క".

అబ్బ! ఎంత బాగుందో పేరు... ఇంతకీ అనుష్క అంటే అర్థమేమిటీ? ఆ! అర్థం ఏమయితే ఏమిటీ? వినడానికి బాగుండాలి గాని! వెంటనే పెళ్లిచూపులకు తల్లిని వెంటబెట్టుకొని వెళ్లి చూసొచ్చాడు. చలం తల్లి పెళ్లిచూపుల

తతంగం జరిగినంతసేపూ ముభావంగా ఉంది. ఆవిడకు కోపం వచ్చిందని తెలుసు చలానికి. తెలీనట్లుగా నటించి ఊరుకున్నాడు. పిల్ల సన్నగా పొడుగ్గా అందంగా బాపు బొమ్మలా ఉంది. పేరుకు తగ్గట్టు ఉంది అనుకున్నాడు. మళ్లీ వెంటనే బుర్రగోక్కుని "పేరుకు తగ్గట్టు అంటే?" అని ప్రశ్న కూడా వేసుకున్నాడు. పిల్ల ఒంటిమీద చిన్నమెత్తు బంగారం కూడా లేదు.

తండ్రి రైల్వేగార్డుకదా! జండా ఊపడంతోనే జీవితమంతా గడిచిపోయి ఉంటుంది. ఇంక కూతురుకు నగలేం చేయిస్తాడు? "ఏదో మధ్య తరగతి కుటుంబం. కట్నాలూ కానుకలూ ఇచ్చు కోలేం" అన్నాడు పిల్ల తండ్రి.

చలం ఏదో అనబోయాడు. ఇంతలో వాళ్ల మ్మ అందుకొని, "అలాంటివి మాకూ గిట్టవు లెండి! పెళ్లి బాగా చెయ్యండి చాలు" అంది.

చలం హతాశుడయ్యాడు. "అంటే చేతి చమురు వదిలించుకుని పిల్లను ఇంటికి కోడలు గా తెచ్చుకోవాలన్నమాట!" అనుకున్నాడు. ముహూర్తాలు నిశ్చయమయ్యాయి. తాంబూలాలు పుచ్చుకున్నారు. శుభలేఖలు ప్రింటయ్యాయి. ఒక రోజు ధైర్యం చేసి ఈ కబురు చెబుదామని మామయ్యా ఇంటికి ఫోన్ చేశాడు. చలం గొంతు వినగానే ఆయన ఫోన్ పెట్టేశాడు. పోస్టులో మామయ్యాకు శుభలేఖ పంపించాడు. ఇంక పెళ్లి ఖర్చుల కోసం బ్యాంకులో పర్సనల్ లోన్ తీసుకున్నాడు. పెళ్లి విజయనగరంలోనే. ముహూర్తం రాత్రి ఒంటిగంటా రెండు నిమిషాలకు.

ఊళ్లో జనమంతా ముందుగా ఇచ్చిన విందుకు వచ్చి చిన్నా చితకా కానుకలు ఇచ్చి నిష్క్రమించారు. చలానికి ఈ ముహూర్తానికి సంబంధించిన ఒక అందమైన దృశ్యం మనో ఫలకంమీద ఉంది. పెళ్లికి ముందు రిసెప్షన్‌లో కూర్చోబెట్టటం... తనూ, ఆమె వచ్చిన వాళ్లవైపు చూస్తూ పెదవులు విడీవిడకుండా నవ్వటం, అప్పుడప్పుడూ ఒకరివైపు ఒకరు చూసి ముగ్ధ మనోహరంగా నవ్వుకోవటం, క్రీగంటి చూపులతో మాటలాడుకోవడం... ప్చ్! అసలా సుందర దృశ్యం పూర్తిగా మిస్సయిపోయింది. చలాన్ని ముందుగా వివాహవేదికపై కూర్చోబెట్టి పురోహితుడు అతడి చేత పూజా కార్యక్రమాన్ని నిర్వర్తిస్తున్నాడు. మరికాసేపట్లో కన్యాదానం చేయవలసిన పిల్ల తల్లీ తండ్రీ వేదిక మీదకు వచ్చారు.

చలం వాళ్లను చూసి నిర్ఘాంతపోయాడు. వాళ్లు... వాళ్లు... చలం మామయ్య... అత్తయ్యానూ. నోట మాట రావటంలేదు చలానికి. ఇదేమిటి? వీళ్లెందుకు వేదికమీదకు వచ్చారు? తన మీద ఏమయినా కుట్ర జరుగుతున్నదా? మనసులో అలజడిగా ఉంది చలానికి. ఆ తర్వాత కాసేపటికి గంపలో వచ్చింది పెళ్లికూతురు. చలం మర్యాదలు వదిలేసి, లేచి నిలబడి పెళ్లి కూతుర్ని చూశాడు – అనుష్కే. చుట్టూ ఉన్న జనం ఇది చూసి పక్కున నవ్వారు. పురోహితుడు సన్నగా చలాన్ని మందలించాడు.

"కూర్చోవయ్యా అకాశరామన్నా!" అన్నాడు వాళ్ల మామయ్య నవ్వుతూ. చలం గాభరాగా ప్రక్కకు తిరిగి తల్లివైపు చూసాడు.

"నీ పెళ్లాం పేరు అనుష్కగా మారింది కదా! ఇంక గాభరా ఎందుకు?" అంది వాళ్లమ్మ నవ్వుతూ.

శోభనం రోజు రాత్రి తెలిసింది ఆ రైల్వేగార్డు అనుష్క... అదే కనకమహాలక్ష్మి పినతల్లి మొగుడని... అందరి ముందూ తనెంత చవలాయి అయిపోయాడో అర్థమైన చలం తన ముఖాన్ని ఎక్కడుంచుకోవాలో తెలీక భార్యగుండెల్లో దాచుకున్నాడు. ●